# అనుతాపం-అనురాగం

## భమిడిపాటి జగన్నాథరావు

అనూరాధ దాబా చివరకొచ్చి స్తంభంపై చేయాన్చి వీధిలోకి చూసింది. స్తంభానికి అల్లుకొని పైకెగబాకుతున్న మాధవీలత చెవికి తగిలింది.

కింద గడియారం గంటలు కొడుతోంది. లెక్కపెట్టోంది అనూరాధ - ఒకటీ, రెండూ...ఎనిమిది.

అబ్బ! ఎనిమిదైందన్నమాట! 'ఈయనింకా రారేం చెప్మా-?' అనుకొంది.

పిక్చరు కెళ్ళారేమో? మంచివేవీ లేవన్నారుగా! అంతకంటె రేడియో ట్యూన్ చేసి కూచుంటే మంచి పాటలొస్తాయన్నారుగా ఎక్కడ కెళ్ళారు చెప్మా!

ఆయనకి పాటలంటే ఇష్టం...లలిత సంగీతం మరీను.

తనకి శాస్త్రీయ సంగీతమంటే మక్కువ. చిన్నప్పటి సాధకం మూలాన్నేమో.

ఇప్పుడా శ్రద్ధ లేకుండాపోతోంది. ఆ ఫిడేలు అలా పెట్టెలోనే మూలుగుతోంది. మధ్య, మధ్య కూనిరాగాలు తప్పితే గొంతు విప్పిపాడడం తగిపోతోంది.

'అలా కూనిరాగాలు తీయకపోతే, కొత్త కొత్తపాటలు నేర్చుకోకూడదూ?' అంటారాయన కొంటెగా చూస్తూ...ఆయనలా అంటూంటే తనకంత సిగ్గనిపిస్తుందేవిటో.

వీధి చివర కనపడుతూన్న దెవరు చెప్మా! పొడుగ్గా వున్నారు...ఈయనేనేమో. 'పొడుగు' అనగానే తనకి 'ఆ' సంగతి జ్ఞప్తికొస్తుంది.

ఆనాటి సంఘటన తలుచుకుంటే, ఏవిటోలా అనిపించి, ఈనాడు కూడ సిగ్గు ముంచుకొస్తుంది.

మావయ్య ఆ రోజు పెళ్ళిచూపులకి తీసుకొచ్చాడు...ఈయన్నీ, అత్తగార్నీ. స్కూల్ ఫైనల్ చదువుతోందితను. కారణం తెలిసుకొని, అందరూ 'ఈ' సంబంధం అయిపోతుందనుకున్నారు. ఇంకో గమతు—వాళ్ళిద్దరూ సరాసరి తమ ఇంట్లోనే దిగడం, లాంఛనంగా చూపించడం పాట, వగైరాలన్నీ అయిపోయాయి. ఆ సాయంత్రం చెప్పారట అత్తగారు: "ఇక ముహూర్తం గట్రా చూడ్డంమీదే తరవాయి" అని.

తను ఆ రోజు ఇక గదిలోంచి కదిలితే ఒట్టు...అంత...సిగ్గనిపించింది. రెండో రోజు పొద్దుట వాళ్ళు వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు. తను మెట్లెక్కి మేడమీదికి వెళ్తోంది...పొడగుకోసం. మెట్లెక్కి చూస్తే ఆయనున్నారు—తనకేసే చూస్తూ. చప్పున ఎక్కడైనా దాక్కోవాలనిపించింది. కాలుకదల్లే...అలాగే నిల్చుండి పోయాను ఏమనడానికి, ఎటూ పోడానికి పాలుపోక.

ఇంతలో అత్తగారు దగరకొచ్చి తల మీద చెయ్యేసి, నిమురుతూ "అలా భంగారుపడతావేమే వెర్రిపిల్లా! ఏదీ. ఇలా దగరిగా రా; మా వాడి పక్కనుంచో—ఓమాటు చూస్తాను" అన్నారు. తను కదలలేక శిలలా అయిపోయింది ఎంచేతో!

"నువ్వేరారా, రామం! పక్కనుంచో"

ఆయన పక్కకి వొచ్చారు. తనకు బాగా జ్ఞాపకం...తనకిష్టమైన నల్లటివోణీ, పువ్వుల పరికిణీ కట్టుకున్నది. ఆయన పక్కనుంచుంటే ఆయన భుజం వొణికి తగుల్తూవుంది. తనముఖం సిగ్గుతో కందగడ్డైపోయింది.

"భయం లేదులే అమ్మా, నేనే పొడుగులే కొద్దిగా" అని ఆయన ఇంకో కొద్ది దగరగా వచ్చారు, కొట్టుకోమన్నట్టు. ఆయన చేయి తన భుజానికి తగిలింది. వంట్లోంచి, ఏమిటో వణుకులా వచ్చింది. తనకున్న పొడుగుకూడా కరిగిపోయినట్లనిపించింది. తల ఎత్తలేకపోయింది.

అనూరాధ ఆలోచనలోంచి తేరుకొని తలఎత్తి మరోమాటు వీధిలోకి చూసింది.

అవ్వే, అపొడుగ్గా వస్తున్న దీయనకాదు. హైస్కూల్లో పని చేస్తున్న టీచరు. పాపం, ఈవిడ ఇప్పుడెళ్ళి వంట చేసుకోవాలి. ఆ వున్న ఒక్క తమ్ముణ్ణీ కాలేజీలో చదివించడానికి ఈ తాపత్రయమంతాను. ఆ తమ్ముడికి ఎక్కడలేని అక్కతాయి గుణాలు వొచ్చాయి. మొన్న 'సుధ' చెప్తోందిగా...అమ్మాయిల వెనకాల తిరుగుతాడని.

ఆవిడ ఉద్యోగంచేస్తూ, ఇంటిపనంతా చేసుకుంటుంది. ఇప్పుడు ప్రైవేట్లు చెప్పి వస్తోంది కాబోలు. ఈవిడంతో మంచిది. ఆ మధ్య సువసబుగారింటికి పేరంటానికొచ్చినప్పుడు, తనతో ఎంత ఆప్యాయంగా చక్కగా మాట్లాడింది. పాపం! ఆవిడ ఒక్కర్తీ విడిగా, ఏదో వెలిగా చూశారక్కడ. ఎంత బాధపడి వుంటుందో!

అందరికీ పసుపురాసి ఈవిడ కాళ్ళకి రాయకుండా మూస్తూ పూరగొంది ఆ వరదమ్మగారు.

"రాయండీ" అంటూ చీర కుచ్చిళ్ళు సున్నితంగా పైకితీసి, ఎంతవెన్నెల చిలకరించిందీ ఆ చిరునవ్వులో. పాదాలు పచ్చగా మెరిసిపోయాయి.

"అబ్బే, దగ్గవుకున్నవాళ్ళు పసుపూ గట్రా రాయించుకోకమానరని అనుకున్నానమ్మాయ్! మాదంతా పూర్వాచారం, ఏదో తెలీనివాళ్ళం," అంది వరదమ్మగారు గట్టిగా.



నరసమ్మగారికి ఇంకోళ్ళని బాధపెట్టడం బాగా తెలుసు...మిగతా వేవీ తెలీక పోయినా. నరసమ్మగారి మాటలు తనకే బాణ అనిపించేయే...ఆవిడంతా మనసులో దాచుకుని, అబ్బే, నాకలాటి అభ్యంతరాలు లేవండీ అని నవ్వుతూ, ఎలా అనగలిందో! నరసమ్మగారు ఆవిడ కట్టుకున్న సిల్కు చీర పాడవాలన్నట్లు పాదాలేకాకుండ, మోకాళ్ళదాకా రాసినంత పనిచేసి పోయింది. మళ్ళా నరసమ్మగారి మనవరాలు ఎక్కడైన పేరంటానికొస్తే కొత్త గోళ్ళకి రాయండీ అంటుంది మామ్మపక్క నుండగానే.

ఇలాటి నూటిపోటి మాటలుపడూ ఆవిడెలా నెగుకొస్తోందో!...వీధులో మగవాళ్ళలో, చుట్టుపక్కల ఆడవాళ్ళలోను. ఆ చిరునవ్వే ఆవిడకి భూషణం. ఆనవ్వులో ఎదుటివాళ్ళ మాలిన్యంకూడ హరించుకుపోయే శక్తివుంది. మరి ఆ నరసమ్మగారెలా అనగలిందా మాటలు!



ఈవిడ సంగతి చెప్తూ చాలామంచిదని ఆయన్తో అంటే, "మీ అన్నయ్యకో ఉత్తరం రాయి. వచ్చిచూసుకొని పెళ్ళిచేసుకుంటాడేమో, ఓ పిల్లనైనా రక్షించినవాడవు తావు," అన్నారు నవ్వుతూ.

ఈయనకి పెద్ద గొప్ప, గర్వమూనూ... తనేం కట్నం తీసుకోలేదని. అవున్నిజమే! ఆ మాత్రం గర్వం వుండడంలో తప్పు లేదనిపిస్తుంది. ఈ రోజుల్లో కట్నం లేకుండ ఎవరు చేసుకొంటున్నారు! నాన్నగారు ఇస్తానన్నా ఆమాట ఎత్తవద్దని పంతంపట్టి చేసుకున్నారు.

"సాక్షాతూ లక్ష్మి మా ఇంటికొస్తుంటే, ఇక మాకు వేరే కట్నమెందుకూ!" అన్నారట అత్తిగారు ఆ రోజు నాన్నగారితో. మావగారికి కట్నం తీసుకోక పోవడం మొదట్లో చిన్నతన మనిపించినా, ఒక్కగానొక్క కొడుకు పట్టుదలకి ఒప్పుకున్నారు.

వీళ్ళింట్లో చాలా కాలాన్నించి చిన్న పిల్లలు లేకపోడంతో తనని కన్న కూతురు కంటె ఎక్కువగా, మల్లెపూవులా చూసుకునేవారు అత్తిగారు. మావగారుకూడ ఎంత హుందాగా అభిమానం వ్యక్తపరిచే వారనీ!

"ఇంటో చిన్నపిల్లలు తిరిగి పాతికేళ్ళవ్వొస్తోంది. నీకడుపులో కాయకాస్తే..." అనే అత్తిగారిమాటలు తనకి పులకరింపుగావుండేవి.

విసురుగాలి వీస్తోంది. చల్లటిగాలి చలిగాలిగ మారింది. అనూరాధ ఆకాశంలోకి చూసింది. దూరంగ నల్లమబ్బులు గుమిగూడి పరిగెడుతున్నాయి. చుక్కలు మబ్బుల్లో కలిసిపోతున్నాయి. ఆ నల్లమబ్బులు తన్ని కప్పి తన అందం మింగకుండ వుండేందుకా అన్నట్టు చందమామ పరిగెడుతున్నాడు. గాలి విసురు ఎక్కువైంది.

అనూరాధకి చప్పున భయంవేసింది.

ఇంతసేపు ఎక్కడవున్నారు చెప్మా! గాలి ఎక్కువై పోతోంది, వర్షమొస్తుందేమో కూడాను!

అనూరాధకి వున్నట్టుండి కళ్ళు తిప్పినట్లైంది. కడుపులో కెలికినట్లుగా వుంది.

ఇంత బాధగావుందేమిటో!

కళ్ళుకూడ తిరుగుతున్నాయేంచేతో!

వీపుమీద చల్లనిచేయి తగిలింది. వెనక్కి తిరిగింది. అత్తిగారు ఎక్కడవున్నారు.

"ఇంతగాలిలో ఒక్కతెవీ వున్నావేమే రాధా! కిందికిరా. భోంచేసి పడుకుందువు గాని," అన్నారు లక్ష్మమ్మగారు.

"ఆయన వొస్తారుగా...అప్పుడు తింటా లెండి."

"వాడు ఎప్పుడొస్తాడో! నువ్వు తినేదువుగాని. రా"

"ఎందుకండీ...కాసేపట్లో వస్తారుగా"

"వేచవున్నారా రాధా! నువ్విలా వుండడం మంచిదికాదు, తెలుసా! పోనీ, నీకోసం కాదులే..." అంటూ లక్ష్మమ్మ

# ★ అనుతాపం-అనురాగం ★

గారు, కోడలినడుంచుట్టూ చెయ్యేసి కిందకి తీసుకువెళ్ళారు.

మెట్లు దిగుతూంటే రాధకి మళ్ళా కళ్ళు తిప్పి, వాంతివచ్చే ట్టనిపించింది. అన్నం ముందు కూచున్నదన్న మాటేగాని ఏం తిన లేక పోయింది.

"నీ కిష్టమని చేశానే ఆవకాయ, పచ్చడీను.. ఏవీ ముట్టుకోడం లేదేం తల్లీ" అంది అత్తగారు దగ్గరగాజరిగి.

"ఏవిటో తినాలని లేదండీ...గాభరాగా వుంది."

ఇంతలో మావగారు వంటింటి గుమ్మం దగర కొచ్చారు. లేవబోతూంటే కోడల్ని కూచోమని సంజ్ఞ చేసి "వీడింకా రాలేదూ?" అన్నారు.

"లేదండీ...ఎక్కడి కెళ్ళాడో కాని?" అన్నారు లక్ష్మమ్మగారు.

"ఈపాటి కొచ్చేయ కూడదూ పిల్ల వొక్కర్తే వుంది...బెంగగా పడుతుందనైనా తెలదా," అంటూ వీధిలోకి వెళ్ళిపోయా రాయన.

భోజనం సయించక అనూరాధ కంచం దగరనుండి లేస్తుంటే కళ్ళుతిరిగాయి. దొడ్లో కెళ్ళి వాంతి చేసుకుంది.

"కాస్తయినా తినలేదే తల్లీ! ఒంటరి మనిషివికూడా కాదు...ఏదో కాస్త హితవు చేసుకోవాలి. ఆ బీరువాలో బత్తాయి పళ్ళున్నాయి. అవి తీసుకుని పైకెళ్ళి కళ్ళు మూసుకు పడుకో — నేను పని చూసుకు వస్తాను," అని అత్తగారు మెట్లదాకవచ్చి సాగనంపారు.

మేడమీద గదిలో పడుకొని అనూరాధ కళ్ళుమూసుకొంది.

ఇంత గాభరాగా వుందేవిటి?

కడుపులో కదిలించినట్టై లేచి కూర్చుంది.

డాబామీది కొచ్చింది. గాలి ఇంకా బలంగా వీస్తోంది. మాధవీలత గాలికి రెప రెపలాడి దీనంగా చూస్తోంది. రాతి స్తంభం నిశ్చలంగావుంది.

ఈయనింకివాల్టికి రారేమో?

రేపు తన పుట్టినరోజు కూడాను?

మొన్న, మొన్నటిదాకా అమ్మ ఎంత హడావిడి చేసేది పుట్టిన రోజంటే.

అమ్మ ఏం చేస్తుంటుందో ఇప్పుడు? నాన్నగారు వస్తారేమో?

అమ్మనిచూసి అప్పుడే ఎన్నాళ్ళో అయి పట్టింది. ఐదారు నెలలకిందటి తను ఉత్తరాలు రాయకపోతే అమ్మ విలవిల లాడి పోయిందట! తను ఏమని రాస్తుంది?

రాస్తే 'ఆ' సంగతెలా రాయడం? పైగా ఈయన వేళాకోళాలొకటి... ఇంటికి ఉత్తరం రాయమని. ఎలా రాయాలో, ఏమని రాయాలో తెలీక, సిగ్గుచేత వరసగా మూడు నెలలు ఉత్తరమే రాయలేదు. అమ్మ కంగారుపడి, పెదవదిన పుట్టింటినుండి వస్తుంటే ఇక్కడికి పంపింది...కులాసాగా వున్నటు చూసిరమ్మని.

పెద్దవదిన ఇంట్లో దిగుతూనే తన దగ్గర కొచ్చి, రెండు మాటలాడి, అదోరకంగా చూస్తూ నవ్వింది గమతుగా, ఆవిడ మొహం లోకి చూడలేకపోయిందితను.

వెంటనే అత్తగారి దగ్గరకెళ్ళి, గుసగుస లాడి దగ్గరిగావచ్చి, కొంటెగా చూస్తూ "ఏవిటే విశేషాలు?" అంది.

"ఏమున్నాయి...?" అంది తను మెల్లిగా.

నా అడబడుచుకు మొదటినుంచీ గుట్టే. ఎన్నో నెలేమిటి?" అంది.

"ఏమో నాకు తెలీదు, పోదూ..."

"ఇదిగో ఇప్పుడే చెప్తున్నా నమ్మాయ్... కోనెలుకోసం మీ అన్నయ్యకూడ చూస్తున్నారు. మరి ఏం చెప్తావో?" అంది ఎంతో ఆదరంగా నడుంచుట్టూ చెయ్యేస్తూ.

ఇంటికెళ్ళి వదిన చెప్పగానే, అమ్మ వచ్చేసింది...ఏవేవో చేయించి తీసుకొస్తూ. ఐదో నెల్లోగాని ఏడో నెల్లోగాని తీసికెళ్ళమని అత్తగారు చెప్పారు. గడియారం పదిగంటలు కొట్టింది.

ఈయనింక ఇవాళ రారేమో? ఎప్పుడూ ఇలా చేయలేదే?...ఆరు దాటకుండానే వచ్చేసేవారు.

అబ్బ! కడుపులో ఇలా తిప్పుతోందేం చెప్మా! వికారంతో కళ్ళుకూడ తిరుగుతు న్నాయి. ఇంత బాధగా వుందేం?

గాలి తీవ్రతకి మాధవీలత వణికిపోయినట్టు రెపరెప లాడింది.



అనూరాధ బాధగా గదిలో కెళ్ళి మంచం పై వాలింది.

రేపు తనపుట్టినరోజు పండగనగా, ఇవాళ తనకింత బాధగా వుందేవిటో! రేపు పుట్టిన రోజనగానే, అమ్మదగ్గర వుండగా ఎంత సంతోషంగా వుండేది. ఆ రోజున కొత్త వోణీ, పరికిణీ కట్టుకొని, అమ్మ చేసిన 'స్వీటు' తింటూ...ఎంతో బావుండేది.

ఆ అలవాటు అత్తగారుకూడా మానలేదు. తను వచ్చింటున్నా, పండుగ రేపనగా అం[illegible] స్పెత కొత్త చీర తీయించి, కట్టించిగాని వూరుకునేవారు కారు.

మొన్నామధ్య సినిమా కెళ్ళినప్పుడు ఆ చివర ఆ పేపరు విశ్వనాథంగారి భార్య కట్టుకున్న చీర ఎంత బావుంది! ఆయనకి చూపించి "చీర బావుందికదూ..." అంటే "అంటే కావాలనేగా! ఆడవాళ్ళ ఇలా రోజులో కోరిన కోరిక తప్పకుండా తీర్చాలని శాస్త్రకారుడు లిఖించాడుగా. తీసుకొస్తాలే," అన్నారు.

అన్నారేకాని, వెంటనే మర్చిపోయినట్టున్నారు. ఆ చీర పుట్టినరోజునాడు కట్టుకోవాలనిపించింది. మొన్న జ్ఞాపకం చేద్దామంటే తీరా చీర రంగుకూడ జ్ఞాపకం లేదాయె. ఈ మొగాళ్ళకెప్పుడూ ఇంతే...చీరల విషయంలో రంగూ, బోర్డరూ ఏవీ జ్ఞాపకముండవు.

"ఆరుద్ర పురుగు రంగండీ" అంటే— "ఆరుద్ర పురుగు ఎలా వుంటుంది?" అని అనడం.

మొత్తానికి చీర తీసుకొచ్చి చూపిస్తేకాని తెలీలేదు.

కొట్టొచ్చే రంగూ, తళతళ మెరుస్తూ జల్లటి బోర్డరూ...ముద్దొస్తూ వుంది చీర.

ఈయనే రాకపోతే, ఇక చీర ఎక్కడి నుంచి వస్తుంది?

అసలింతసేపటిదాకా ఎందుకు రాకపోవాలి? అనూరాధకి వున్నట్టుండి కళ్ళ నీళ్ళు తిరిగాయి.

పైగా తన కింత బాధగా వుంటే ఇంటి కింకా రాలేదు.

పదకొండుకూడ కావస్తోంది. మళ్ళా సాయంత్రం పెందరాళే ఇంటికొస్తానని చెప్పడం.

క్లబ్బుకెళ్ళారేమో? ఈమధ్య మా[illegible] సీనా, ఆ 'చంద్రం'గారువస్తే, ఆక్లబ్బులో కూచుని ఊహు కబురు.

ఈయనకింత అశ్రద్ధ ఐతే నేనెందుకు ఇక్కడుండడం? నాన్నగార్ని రమ్మని రాసి వెళ్ళిపోతే సరి.

గడియారం పదకొండు కొట్టింది. ఆకాశం ఉరుములతో మెరుపులతో దద్దరిల్లిపోతోంది. ఇక వర్షం రావడం ఆగదు.

అనూరాధ కళు ఒక్కమాటుగా [illegible]

# ★ అనుతాపం-అనురాగం ★



చాయి. ఆమె కన్నీటికి అంతులేకపోయింది. కన్నీటితో పాటు, ఎవరిమీదో తెలీని కోపం కూడా పెరుగుతుంది. ఆ కోపంకాస్తా భర్త మీదికి తిరిగింది.

నాకు తెలుసు, ఈయనివాళ కింక రారు! ఎక్కడకెళ్తే నాకెందుకు? నాకింత బాధగా వుంటే కాస్త పలకరించడానికైనా దగ్గ రుండేనా! అమ్మవుంటే ఎంత బావుణ్ణు... ఏమైనా రేపు పొద్దుటే బయల్దేరి ఇంటికెళ్ళి పోతేసరి. రేపైనా వస్తారు గా వచ్చినా చెప్పేసి వెళ్ళిపోతే ఏమంటారేమిటి?

అనూరాధ భయంతో, బాధతో కళ్ళు మూసుకొంది. బైట వర్షం ఎక్కువైంది. మాధవీలత వర్షంలో తడిసి, ప్రకృతి బీభత్సానికి కోషిల్లి, నీరసపడిపోయింది.

అనూరాధ నిశ్చయానికొచ్చేసింది.

రేపు ఆయనవొస్తే చెప్పేసి ఇంటికెళ్ళి పోతాను.

ఏవో ఆలోచనలతో, కడుపులో బాధతో, అనూరాధ అలసిపోయి, ఒంటిగంటదాకా భర్తకోసం ఎదురుచూసి, చూసి విసిగి, వేసారి, తనకి తెలీకుండానే నిద్రపోయింది.

అనూరాధకి చటుక్కుని తెలివొచ్చింది.. చల్లటి చేతి స్పర్శతో. భారంగా కళ్ళు తెరిచింది.

ఎదురుగా రామారావు భార్య వదనాన్ని చేతుల్లోకి తీసుకు చూస్తున్నాడు.

"ఏడేమిటి రాధా......నిద్రలో ఏడుస్తున్నావ్......పీడకల ఏమైనా వచ్చిందా?" అన్నాడు ఆమె చెక్కిలమీది కన్నీరు తుడుస్తూ.

"ఎంతసేపైయిం దేమిటి వచ్చి?" అంది అనూరాధ భర్త చేతులు దూరంగా తీసేస్తూ.

"ఇప్పుడే...పావుగంటైంది."

"టైమెంతైంది ఇప్పుడు?"

"తెల్లారిపోయింది. ఆరు కావస్తోంది."

"పోనీ రెండు రోజులాగి రాలేకపోయారా?... నా పుట్టినరోజు కాస్త దాటిపోను."

"అదేమిటి రాధా. దానికోసమేకదా, ఎంతో ఆదుర్దాగా వచ్చాను."

"మీరంత ఆదుర్దాపడనవసరం లేదులెండి. పొద్దుట పదిగంటల బండికి నేను మా వూరు వెళ్తున్నాను. మా వాళ్ళకో 'వైర్'మాత్రం ఇవ్వండి...స్టేషనుకు రమ్మని" విసురుగా లేచింది అనూరాధ.

తెల్లబోయాడు రామారావు: "వెర్రివు గానిలే రాధా...నీకంతగా వెళ్ళాలని వుంటే నే తీసికెళ్ళి దిగబెడతాలే. కాని పుట్టినరోజు నాడు వెళ్ళడ మేమిటే?"

"నేను ఎక్కడవుంటే మీకేం పట్టుకుంది లెండి. అంచేత ఇవాళ వెళ్ళడం ఖాయం. వైజాగ్ వైర్ మాత్రం ఇవ్వండి" అని అనూరాధ మంచం దిగి కిందికెళ్ళిపోయింది.

రామారావు రాత్రంతా నిద్రలేక భారంగ వున్నాడేమో, ఈ సంఘటనతో మరీ బాధ పడ్డాడు. కళ్ళు మూసుకొని పడుకొన్నా నిద్రపట్టలేదు. లేచి మొహం కడుక్కొని కూర్చున్నాడు. అరగంటలో ఫ్లాస్కులో కాఫీ పట్టుకొచ్చి, టేబిల్ మీద పెట్టి వెళ్ళిపోబోతూంది రాధ.

"ఇలా కూర్చో, రాధా! నా మాట పూర్తిగా వినకుండా అంతలా శిక్షిస్తే ఎలా?"

"ఏదో తొందరగా చెప్పండి. కింద పనుందికూడాను. నేను బట్టలుకూడ సర్దుకో వాలి" అంది ముభావంగా అనూరాధ.

"నీకు రాత్రి వంట్లో బావుండ లేదటగా...అమ్మ చెప్పిందిలే. రాత్రి ఓమాటు పైకొచ్చి చూసిందట. లైటార్పేసి వుంటే నిద్రపోతున్నావనుకుని వెళ్ళిపోయిందట. నీకు ఇంటికెళ్ళాలని బెంగగావుందేమో అంది అమ్మ. వెళ్ళాలనివుందా రాధా?"

"నాకు బావుండకపోతే దగ్గరున్నవాళ్ళే వరులెండి."

ఎందుకోకాని రాధకి తనమీద కోపమొచ్చిందని గ్రహించాడు రామారావు. ఇలాటి సమయంలో సానునయంగా మాట్లాడకపోతే బాధపడుతుందనిపించింది.

"నీకంతగా వెళ్ళాలనివుంటే నా అభ్యంతరమేముంది రాధా! నేనో, నాన్నగారో రెండురోజుల్లో వీలుచూసుకు దిగబెడతాంలే."

"మీకు వీలెక్కడలెండి......ఎన్నిపను లుంటాయో! ఏమైన, నాకివాళ వెళ్ళాలని వుంది," అంది అనూరాధ అదే ఆఖరి మాటన్నట్టు.

ఆమె నిశ్చయానికి తిరుగులేదనిపించింది రామారావుకు.

"సరే ఐతే...ఇవాళే వెళ్ళు" అని కాసే పాగి. "వెళ్ళేటప్పుడుమాత్రం నా కోరిక పాటించి, ఈ చీరకట్టుకొని మరీవెళ్ళు" అంటూ రామారావు బేగ్ లోంచి, ప్యాకెట్ తీసి, కవర్ తీసేసి, చీర అందిచ్చాడు.

తెల్లబోయి మ్రాన్పడిపోయింది అనూరాధ.

ఆరుద్ర పురుగు రంగుచీర...నల్లటి జరీ బోర్డరు.

వెంటనే ఏమనడానికీ పాలుపోలే దామెకు.

"ఎవరు తీసుకొచ్చారు?" అనిమాత్రం అనగలిగింది సన్నగా.

"నిన్న కాలేజీకి వెళ్తుంటే, నీచీరసంగతి జ్ఞాపకమొచ్చింది. సెకండవర్ వర్కు లేపోడంతో వూళ్ళోకెళ్ళి వాకబుచేస్తే ఈ వూళ్ళో ఈ చీరదొరకదని తేలింది. ఇంతలో ఆ ప్లీడరు విశ్వనాధంగారు కనిపిస్తే అడిగాను. బెజవాడలో తీసుకున్నారుట... అక్కడ దొరకొచ్చు అన్నాడాయన. బెజవాడ దగ్గరేకదా అని మధ్యాహ్నం కాజువల్ లీవు పడేసి వెళ్ళాను. ట్రెయిన్ దాటి పోతుందని ఇంటికొచ్చి చెప్పలేదు. బెజవాడలో చీరకోసం వెదుకుతూంటే వ[illegible]మొచ్చింది. వర్షంమూలాన చీరకొని స్టేషనుకు రావడానికి ఆలస్యమైంది. రాత్రి ట్రెయిన్ తప్పిపోయి తర్వాతబండిమీద వచ్చేటప్పటికి ఆలస్యమైపోయింది. చీర మాత్రం కట్టుకువెళ్ళు. నా సరదా తీరుతుంది", అంటూ రామారావు భార్యచేతిలో పెట్టాడు చీరని.

రాధ సంగతంతా విని ఏమనలేకపోయింది. లజ్జతో, తను ఆలోచించిన విధానానికి కుమిలిపోయింది.

పాపం! ఎంత కష్టపడ్డారో...తన సరదా తీర్చడానికి. తనుమాత్రం ఇష్టమొచ్చినట్టు అర్థాలు తీసుకొని, ఆయన మనసు బాధపెట్టింది.

రాత్రి కడుపులో బాధ, వర్షం, ప్రకృతి బీభత్సం...వీటితో మనసు కదిలిపోయి, కారణంలేని కోపాన్ని, ఏమీ తెలీని ఈయన మీదికి తోసేసి, పంతం పట్టింది. ఎంత బాధ పడ్డారో, పాపం! చేసినతప్పుకు నోటితో క్షమాపణ కోరితేమాత్రం, మాలిన్యం కరుగుతుందా? క్షమించలేని యీ తన పంతానికి తనలో కుమిలిపోవడంతప్ప వేరేగత్యంతరం లేదు.

ఈ సింహావలోకనంతో, క్షమాభిక్ష అర్థించే మనసుతో, జాలితో, లజ్జతో రాధ కళ్ళలో నీళ్ళునిలిచాయి. భర్తచూడకుండా పక్కకి తిరిగి కన్నీరు కొంగుతో అద్దుకొంది.

ఇటుతిరిగి కాఫీ గ్లాసులోపోసి భర్త కందిచ్చింది. రామారావు తాగుతూ దా

## జోకేశ్వరరావు

హుషారుగా ఆఫీసులోకి వచ్చి కూర్చున్న మేనేజరు గుమాస్తాలతో అదేపనిగా ఛలోక్తులు దంచేస్తున్నాడు. గుమాస్తాలతో నవ్వులతో ఉక్కిరి బిక్కిరైపోతున్నారు—ఒక్కడు తప్ప.

"ఏం నువ్వు నవ్వటంలేదే? జోకులు బాగాలేవా?" అన్నాడు మేనేజరు.

"నేను నవ్వక్కర్లేదుసార్. ఈ నెలాఖరికి రాజీనామా ఇచ్చి ఇంకో ఆఫీసులో చేరుతున్నాను" అని జవాబిచ్చాడు ఆ ఉద్యోగి. ★

మీద కొచ్చాడు. అనూరాధ అక్కడ నిలవలేక పోయింది. కిందికొచ్చి మనసులోని క్షోభ కరిగేటంతగా ఏడ్చేసింది...భర్త బంగారు హృదయాన్ని, ఏదో సంబంధంలేని తీవ్ర పరిస్థితుల్లో, తప్పుగా అర్థం చేసుకున్నందుకు.

కాసేపట్లో తేరుకొని స్నానం చేసి, ఏదో తప్పు చేసిన దానిలా కొత్త చీర కట్టుకొని హాలులోకొచ్చింది అనూరాధ.

ఆమె అక్కడ వుండగానే, ఆమె తండ్రి సత్యమూర్తిగారు వచ్చారు..."అమ్మడూ కులాసాకి?" అంటూ, తండ్రికి నీళ్లిచ్చి, అత్తగారితో చెప్పి, డాబామీద కొచ్చింది.

"మా నాన్నగారు వచ్చారు" అంది మెల్లిగా భర్తతో.

రామారావు కిందకొచ్చి మావగార్ని పలకరించాడు. కుశల ప్రశ్నలయ్యాక, సత్యమూర్తిగారు అలుడికి అసలు విషయం చెప్పారు...పిల్లని తీసుకెళ్ళడానికొచ్చానని.

"నా అభ్యంతరం ఏం లేదండీ"

గదిలోంచి భర్తమాటలు విన్న అనూరాధ దుఃఖంతో కుమిలిపోయింది.

ఇంత మంచి మనసుని, ఒక్క రాత్రి రాలేదన్న విషయంలో ఎంత గాయపరిచింది దీనికి పశ్చాత్తాపం కూడచాలదు.

సత్యమూర్తిగారు, లక్ష్మమ్మగారితో కూడ సంగతి చెప్పారు. ఆవిడకూడ "మీ ఇష్టం" అన్నారు.

గదిలో కొచ్చి కూతురితో "అతన్తో కూడ చెప్పాను. మీ అత్తగారు కూడ ఒప్పుకున్నారు. ఎప్పుడు బయల్దేరినా నీ ఇష్టం ఇవాళా, రేపూకూడ మంచిదే" అన్నారు సత్యమూర్తిగారు.

"నేను తర్వాత వస్తాను నాన్నా...... మరో రెండు నెలలు పోయాక, అమ్మతో నే చెప్పానని చెప్పు"

"అది కాదే. అందరూ ఒప్పుకుంటే నీ అభ్యంతరమేవిటి? మీ అమ్మకూడ నీకోసం ఎదురుచూస్తోందే అమ్మడూ."

"నే చెప్పానుగా నాన్నా ... తర్వాత వస్తానని. ఆయ నొచ్చి దిగబెడతారులే. ఆయన వంట్లో కూడ ఈ మధ్య అంత బాగుండటం లేదు" అనేసి మేడమీద కెళ్ళిపోయింది రాధ.

రామారావు డాబాగోడమీదకి వంగి రాతి స్తంభానికి మాలతీలతని సదురుకున్నాడు.

రాధనిచూసి "ఆ చీర ఎలా మెరసిపోతోందో చూడు...నీరంగులో కలిసిపోయి" అన్నాడు.

ఎంతో ఆర్ద్రంగా చూసింది అనూరాధ భర్త వేపు, 'నన్ను క్షమించరూ?' అన్నట్టు.

"ప్రయాణం ఇవాళా రేపా?" అన్నాడు రామారావు.

కాసేపాగి "నేను వెళ్ళడంలేదు. తర్వాత వెళ్తాను" అంది అనూరాధ.

"నాకు కోపమేంలేదు రాధా. నిజంగా నీకు వెళ్ళాలనివుంటే, నా అడ్డు ఏనాడూ లేదు."

అనూరాధ భర్త వదనంలోకి చూస్తూ, దగ్గరగావచ్చి, అతనిచుట్టు సర్దుతూ "నాకు వెళ్ళాలని లేదు" అంది.

జుట్టు అలా సవిరిస్తూనే "ఇదేవిటండీ ఇంత తడిగావుంది తల. వర్షంలో తడిసినట్టున్నారు. తలతుడుస్తాను... గదిలోకి రండీ" అంటూ అనూరాధ, భర్తని గదిలోకి తీసికెళ్ళింది.

భర్త జుట్టు టవల్ తో అద్దుతూ "కాస్త సాంబ్రాణి పొగ కూడ వేస్తానుండండి... లేకపోతే జలుబుచేస్తుందేమో" అంది రాధ.

"ఇంకానయం. చంటిపిల్లాణ్ణా ఏవిటి... సాంబ్రాణి పొగవేయించుకోడానికి" అన్నాడు రామారావు నవ్వుతూ.

మిమ్మల్ని పాపాయిలా కాపాడుకోవల్సిన బాధ్యత నామీదుంది. అంచేత మీ రెప్పుడూ నాకు చంటిపాపాయే" అంది అనురాధ భర్తజుట్టు దువ్వుతూ.

"ఐతే నువ్వు కొంతకాలానికి ఇద్దరు చంటిపాపాయిల్ని కాపాడుతూ, సాకాలన్నమాట" అన్నాడు రామారావు ఆమె నడుంచుటూ చెయ్యేస్తూ.

సిగ్గుతో మొగ్గలా ముడుచుకుపోయింది అనూరాధ. లజ్జతో శరీరమంతా పులకరించింది.

"మీ రెప్పుడూ ఇంతే బాబూ...అంది దూరంగాజరిగి, పక్కకి తిరిగి.

రామారావు దగ్గరకొచ్చి ఆమెను పొదివి పట్టుకున్నాడు. ఆమె అతనిలో లతలా అల్లుకుపోయింది.

పైన చల్లనిగాలి వీస్తోంది హాయిగా. ఆకాశం ప్రశాంతంగా వుంది. రాతి స్తంభానికి మాధవీలత మరింత దగ్గరగా చుట్టుకుంది, ఆ రాతి స్తంభమనే ఆలంబనమే లేకపోతే. మాధవీలతకు ఆసాబగేది? ★


## తరచుగా మూత్రవిసర్జన

తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైనచిహ్నము. శరీరాన్ని గుల్లచేయడమేకాకుండా యీ వ్యాధి, తనబంధంలో చిక్కిన వారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసికశ్రమను ఓర్చుకోలేకుండుట, నడుములో నొప్పి చూపు మాంద్యము, కాళ్లల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతో కూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో నగుల్లు తూకంతగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ల నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్ ఛారమ్" మాత్రలు వాడి, అనేక వేలమంది తమబాధల నుండివిమోచనపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి, "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనాని వైద్యవిధానప్రకారం అమూల్య ఓషధుల, శాకపదార్థముల, ప్రాకృతిక క్షారముల సారముతో తయారైనవి. "అమిత దాహం తగ్గి.... పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము, 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును. కొద్ది రోజులలోనే మీకు పగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో, సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు. నిరాహారముతో నుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటె యెక్కువరకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును. వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును.

ధర: 50 మాత్రల సీసా రు. 6-75

ప్యాకింగు పోస్టేజీ ఉచితము.

లభించు స్థలము :

Venus Research Laboratory (A.P.W

P. O. Box No. 587, Calcutta.)